



• నగరంలో హనుమాన్ భారీ శోభాయాత్ర

ఘనంగా హనుమాన్ జయంతి

- వైభవంగా హనుమాన్ శోభాయాత్ర
- కాషాయమయమైన ఇందూరు
- మార్మోగిన భక్తుల 'జైశ్రీరాం' నినాదాలు
- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: జిల్లా వ్యాప్తంగా మంగళవారం హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని హనుమాన్ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, మొక్కులు తీర్చుకున్నారు. నగరంలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వీర హనుమాన్ విజయయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. జైశ్రీరాం అంటూ భక్తుల నినాదాలు, హనుమాన్ డీజే పాటలు, 'రామ్ లక్ష్మణ జానకి జైబోలో హనుమాన్‌కి' అంటూ భక్తులు నృత్యాలు చేస్తూ విజయయాత్రలో పాల్గొన్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన విజయ యాత్ర జిల్లా పరిషత్ చౌరస్తా, హమాల్‌వాడి, నాందేవ్‌వాడ, రైల్వేబ్రిడ్జి, దేవీరోడ్, గాంధీచౌక్, నెహ్రూపార్క్, పెద్దబజార్ మీదుగా రాజరాజేంద్ర చౌరస్తా వరకు సాగింది. ప్రారంభ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొని కొబ్బరికాయ కొట్టి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతుని గొప్పతనాన్ని నేతలు వివరించారు. పెద్ద సంఖ్యలో యువకులు విజయయాత్రలో పాల్గొన్నారు. కాషాయ జెండాలు పట్టుకొని బైకులపై తిరుగుతూ నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్‌గుప్త, జీవన్‌రెడ్డి, మేయర్ నీతూకిరణ్‌లు విజయయాత్రలో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చౌరస్తా వద్ద విజయయాత్రలో పాల్గొన్నవారు అనంతరం అక్కడ భక్తులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అంతకు ముందు నగరంలోని గోల్‌హనుమాన్, రోకడ హనుమాన్‌లలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద భక్తుల కోసం టిఫిన్స్ ఏర్పాటు చేశారు. వాటిని ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు సైతం భక్తులకు వేసవి వల్ల ఇబ్బందులు పడకుండా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, పులిహోరా పంపిణీ చేశారు.

ఆలయాల కిటకిట..

హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలోని ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. సారంగపూర్ హనుమాన్ ఆలయం, నీరుగొండ హనుమాన్ ఆలయం, గోల్ హనుమాన్, రోకడ హనుమాన్, వినాయక్‌నగర్ హనుమాన్ విగ్రహం దగ్గర తదితర ఆలయాలలో భక్తులు ప్రత్యే క పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తుల సందడి కనిపించింది. హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, పులిహోర, పండ్లు, ప్రసాదాలను పంపిణీ చేశారు.

పోలీసుల భారీ బందోబస్తు..

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సందర్భంగా జరుగుతున్న వీరహనుమాన్ విజయ యాత్రలో ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. విజయయాత్ర కొనసాగే ప్రాంతాల్లో బారికేడ్లలను ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూశారు. యాత్ర సాగే ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ఇతర ప్రాంతాల్లోకి మళ్లించారు. యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంతవరకు యాత్ర వెంట పోలీసుల బందోబస్తు కొనసాగింది.









• శోభాయాత్రలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్

కొనసాగుతున్న నామినేషన్లు

• మంగళవారం 16 నామినేషన్ల దాఖలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి మంగళవారం 16 నామినేషన్లు దాఖలయ్యాయి. బహుజన లెఫ్ట్‌పార్టీ అభ్యర్థిగా అశోక్‌గౌడ్, ఆల్ ఇండియా బీసీ ఓబీసీ పార్టీ అభ్యర్థిగా పోతు నవీన్, ప్రజాసేన పార్టీ అభ్యర్థిగా పోతు నాగార్జున్, ఆల్ ఇండియా నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఎండీ షాహెద్ ఖాన్, దళిత బహుజన పార్టీ అభ్యర్థిగా గోలి నరేష్‌లు నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొత్తకొండ శక్తిప్రసాద్, బీటీ నాయక్, మహ్మద్ జమీల్, జి.సాయికృష్ణమూర్తిలు నామినేషన్లు వేశారు. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన రాపెల్లి సత్యనారాయణ రెండవ సెట్, రాపెల్లి శ్రీనివాస్ మూడవ సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిట ర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మం తుకు అందజేశారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్ మూడవ సెట్ నామినేషన్‌లను దాఖలు చేశారు. వీరితో పాటు అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా యుగందర్‌గట్ల, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా కోటగిరి శ్రీనివాస్, విద్యా ర్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా బూక్యానంద్ మూడవ సెట్, స్వతంత్ర అభ్యర్థిగా కాట్రాజు ప్రశాంత్ రెండవ సెట్ నామినేషన్లు వేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 26 మంది అభ్యర్థులు 44 నామి నేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు.





వానాకాలం సాగు ప్రణాళిక ఖరారు

- వానాకాలంలో 5,52,128 ఎకరాల్లో సాగవుతుందని అంచనా
- ఎరువులు, విత్తనాల కోసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించిన అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వచ్చే వానాకాలం సాగు కోసం వ్యవసాయ శాఖ అధికారులు యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేశారు. ముందస్తుగానే జిల్లాలో ఎంతమొత్తం వానాకాలంలో సాగవుతుందో అంచనాకు వచ్చారు. ఈ విస్తీర్ణంకు అనుగుణంగా కావాల్సిన ఎరువులు, విత్తనాల కోసం ప్రభుత్వానికి నివేదించారు. వచ్చే నెల నుంచి రైతులకు ఎరువులతో పాటు విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం యాసంగి సీజన్ పూర్తవుతుండడంతో పూర్తిస్థాయిలో వచ్చే వానాకాలంపై దృష్టిపెట్టి పనులు చేసేందుకు ఆ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

4,30,550 ఎకరాల్లో వరి సాగువుతుందని అంచనా

జిల్లాలో 5,52,128 ఎకరాల్లో వానాకాలంలో సాగ వుతుందని అంచనా వేసారు. గత వానాకాలంలో జిల్లాలో 5,51,982 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఆ విస్తీర్ణంకు అనుగుణంగానే వచ్చే వానాకాలంకు ఈ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేశారు. వచ్చే వానాకాలంలో వరి 4,30,550 ఎకరాల్లో సాగువుతందని అంచనా వేశారు. మొత్తం సాగులో 75శాతం వరకు వరినే సాగుచేస్తారని శాఖ అధికారులు అంచనా వేశారు. వరి తర్వాత మొక్కజొన్న 41,909 ఎకరాల్లో, సోయాబిన్ 51,478 ఎకరాల్లో, పత్తి 3,273 ఎకరాల్లో, కందులు 1444ఎకరాల్లో, పసుపు 19606 ఎకరాలు, ఇతర పంటలు 3868 ఎకరాల్లో సాగవుతుందని అంచనాకు వచ్చారు. ఈ నివేదికను ఖరారు చేయ డంతో పాటు ప్రభుత్వానికి పంపించారు.

జిల్లాకు 1,29,165 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

వానాకాలంలో సాగయ్యే పంటల కోసం ఎంతమొత్తంలో విత్తనాలు అవసరం ఉంటాయో అధికారులు అంచనా వేశారు. ప్రతిపాదనలు పంటల వారీగా తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. వరిసాగు అత్యధికంగా రానుండడంతో జిల్లాకు 1,29,165 క్వింటాళ్ల విత్తనాలు కావాలని అంచనాకు వచ్చారు. ఈ విత్తనాలను అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా వీటిని పంపిణీ చేయనున్నారు. మొక్కజొన్నకు 3353 క్వింటాళ్లు, పెసర 10 క్వింటాళ్లు, కందులు 58 క్వింటాళ్లు, మినుములు 15 క్వింటాళ్లు, సోయాబీన్ 15,443 క్వింటాళ్లు, పత్తి 6546 ప్యాకెట్లు, దైంచా 16వేల క్వింటాళ్లు, సన్‌హెంపో 250 క్వింటాళ్లు అవసరమని అంచనా వేశారు. వీటిని జిల్లాకు తీసుకురావడంతో పాటు వచ్చేనెల నుంచి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ సంవత్సరం విత్తనాలను సబ్సిడీగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు కూడా ఎదురుచూస్తున్నారు. వానాకాలం సీజన్‌కు మరో 40 రోజుల సమయం ఉండడంతో ఆలోపే ప్రభుత్వం ఏ విత్తనాలకు సబ్సిడీ ఇస్తుందో ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎరువుల కోసం ఏర్పాట్లు

జిల్లాలో వచ్చే వానాకాలంలో అత్యధికంగా పంటల విస్తీర్ణం కానుండడంతో ముందస్తుగానే ఎరువుల అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరి అత్యధికంగా సాగవుతుండడంతో రైతులు ఎక్కువగా యూరియాను ప్రతి సంవత్సరం వినియోగిస్తున్నారు. ఈ సంవత్సరం వనకాలంలో మొత్తం 78,880 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని ప్రతిపాదనలను తయారు చేశారు. గత సంవత్సరం వానకాలంలో 73,786 టన్నుల యూరియా వినియోగించడంతో ప్రస్తుతం ఈ నిర్ణయం తీసుకున్నారు. డీఏపీ 16490 మెట్రిక్ టన్నులు, ఎంటపీ -12319 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 40833 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. వచ్చే వానాకాలంలో ఎరువులకు ఇబ్బంది లేకుండా చూసేందుకు ముందస్తుగానే స్టాక్ తీసుకువచ్చి బఫర్‌లో ఉంచే విధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. వచ్చే వానకాలం కోసం యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేశామని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా వరి ఎక్కువగా సాగవుతుందని అంచనాకు వచ్చామని ఆయన తెలిపారు. జిల్లాలో సాగయ్యే పంటల కోసం కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ముందస్తుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆయన తెలిపారు.



నేడు ఇంటర్ ఫలితాలు

• జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాసిన 35,346 మంది విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. బుధవారం 11గంటలకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కమిషనర్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 35,346 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 17,364 మంది ఉండగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,982 మంది ఉన్నారు. ఇంటర్ ఫలితాలు విడుదల కానుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.



బడికి టాటా.. ఇక ఆటాపాట!



- నేటి నుంచి విద్యాలయాలకు సెలవులు
- విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేసిన ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 23: ఏడాదిపాటు పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించడంతో ఇంటిబాట పట్టారు. మంగళవారం విద్యాసంవత్సరం చివరి రోజు కావడంతో ఉపాధ్యాయులు ప్రోగెస్ కార్డులు సిద్ధంచేసి విద్యార్థులకు అందజేశారు. కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

'సెలవుల్లో ఇంటి వద్దనే ఉంటూ చదువుకోవాలి'

మోర్తాడ్, ఏప్రిల్ 23: విద్యార్థులు వేసవి సెలవుల్లో ఎండలో తిరగకుండా ఇంట్లోనే పదో తరగతి పుస్తకాలు చదువుకోవాలని పాలెం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం పాఠశాలలో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 11వరకు వేసవి సెలవులని, తమ పిల్లలను అనవసరంగా బయట తిరగకుండా చూసుకోవాలని అన్నారు



శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్‌గుప్త, జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని గోల్‌హనుమాన్, రేకడ హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్రలో పాల్గొన్నారు. జడ్పీ కార్యాలయం వద్ద భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, సిర్పరాజు, ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శోభాయాత్రలో పాల్గొన్న ఎంపీ అర్వింద్

బోధన్‌లో ఘనంగా వీర హనుమాన్ భారీ శోభాయాత్ర

బోధన్ రూరల్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వ హిందు పరిషత్, భజరంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీర హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్ర పట్టణంలోని మారుతీ మందిరం నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్దకు ప్రశాంతంగా సాగింది. పాత బస్టాండ్‌లో హనుమాన్ చాలీసా పారాయణతో, భజరంగ్ నినాదాలతో మార్మోగింది. అనంతరం హిందూ ధర్మ ప్రచారకులు ముత్యం మాట్లాడుతూ హిందువులు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ భారీ బందోబస్తు నిర్వహించారు.

● 'కాంగ్రెస్ మేనిఫెస్టో భయపడేలా ఉంది'

బోధన్ రూరల్: కాంగ్రెస్ మేనిఫెస్టో చూస్తే భయపడేలా ఉందని, ఈ మేనిఫెస్టోను చూసి ప్రధానమంత్రి ఉలిక్కి పడ్డారంటే అది ఎంత భయకరంగా ఉందో అర్థం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు.మంగళవారం బోధన్ నియోజకవర్గ బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సంపదను దోస్తాం.. మైనారిటీలకు పంచి పెడతాం అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అటకెక్కాయని ఆయన ఆరోపించారు. మైనార్టీ ఓటు బ్యాంకు వైపే కాంగ్రెస్ చూస్తోందని, తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు బీజేపీ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. బోధన్‌లో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల హయాంలోనే మూతపడిందని, ఈ దఫా తాను గెలిచిన అనంతరం తక్షణమే తెరిపిస్తానని, ఇది బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. మారుమారు హ్యాట్రిక్ ప్రధానమంత్రిగా మోదీ కానున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేస్ కులచారి పటేల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డీ మోహన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, నాయకులు సుధాకర్ చారి, నర్సింహ రెడ్డి, బాలరాజులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● 'దేశంలో రామరాజ్య స్థాపన మొదలయ్యింది'


ఖిల్లా: శతాబ్దాల కల అయోధ్యలో రామమందిర ప్రారంభంతో దేశంలో రామరాజ్య స్థాపన మొదలైందని నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు అర్వింద్ ధర్మపురి అన్నారు. హన్మాన్ జయంతి శోభయాత్ర అనంతరం నగరంలోని శివాజీచౌక్ వద్ద విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికలో ఆయన మాట్లాడారు. దేశంలో చట్ట సవరణ చేసుకోవడానికి ఇదే సమయం అని, ప్రధాని మోదీ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చెప్పారని, మనమందరం మరోసారి మోదీని ప్రధానిగా చూడాలన్నారు. శాంతియుతంగా శోభయాత్ర జరుగడానికి విశ్వహిందుపరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. ఇందులో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ప్రముఖులు దినేష్, నందవెంకటేశ్, విభాగ్ తుమ్మలకృష్ణ, గాజుల దయానంద్, డాక్టర్ రాఘవేందర్, అజ్జశ్రీనివాస్, వెంగళ్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.





















విద్యార్థులు సెలవుల్లో చెరువులు వద్దకు వెళ్లరాదు

● జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్



కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్23: పాఠశాల విద్యార్థులు వేసవి సెలవుల్లో తమతమ గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని సాయంత్రం పూట మాత్రమే ఆటలు ఆడుకోవాలని, చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని, ఇంటి వద్ద కఠినంగా ఉన్న సబ్జెక్టులను చదువుకోవాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు ఎంపిక ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట డీసీడీవో అనిత, ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, ఖలీల్ హైమద్, కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు హిమబిందు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు పరామర్శ



కాంగ్రెస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 23: మండలంలోని ధర్మారం(బి)సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త తొండపి రామారావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆరోగ్య విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ ప్రతినిధులు వాసుబాబు, కంచెట్టి గంగాధర్, పులివెంకటేశ్వరరావు, రాధక్రిష్ణ, ఉన్నారు.

యువజన కాంగ్రెస్ నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా రామర్తి గోపి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: యువజన కాంగ్రెస్ నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రామర్తి గోపి నియమితులయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న గోపిని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా యువజన కాంగ్రెస్ క్యాడర్‌ను మరింత క్రియాశీలకంగా పనిచేసే విధంగా నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి రాష్ట్ర బాధ్యులు సురభి ద్వివేది, రాష్ట్ర అధ్యక్షుడు తనపై నమ్మకంతో నిజామాబాద్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ ఇంచార్జిగా బాధ్యతలు ఇచ్చినందుకు గోపి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపు కొరకు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తామన్నారు.

గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్23: మండలంలో తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సుప్రభాత సేవ నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉంజాల సేవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు వచ్చి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ఆవులను తీసుకువచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తడపాకల్‌లో ప్రపంచ పుస్తక దినోత్సవం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏర్గట్ల, ఏప్రిల్ 23: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఏడవ తరగతి విద్యార్థిని నూకల వైష్ణవి రచించిన మార్పు కథల పుస్తకాన్ని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావిద్ ఆవి ష్కరించారు. చిన్న వయస్సులోనే పుస్తకం రచించడం అభినందనీయమని తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ తెలిపారు. అనంతరం విద్యార్థిని ఉపాధ్యాయుల బృందం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, నరేందర్, గంగాధర్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

టీయూ పీజీ రెగ్యులర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

డిచ్‌పల్లి, ఏప్రిల్ 23: తెలంగాణ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని పీజీ రెగ్యులర్ పరీక్షల నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేశారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎల్‌ఎల్‌బీ,ఎల్‌ఎల్‌ఎం, 5ఏళ్ల ఇంటిగ్రెటెడ్ కోర్సు ఏపీఈ,ఐఎంబీఏ, ఐపీసీహెచ్ కోర్సులకు చెందిన 4,6,8,10 వ రెగ్యులర్ సెమిస్టర్ థియరీ ప్రాక్టికల్ ఐఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్,ఐఎంబీఏ 8,10వ సెమిస్టర్ పరీక్షలు జూన్ నెలలో జరగబోయే పరీక్షల ఫీజు తేదీలను ప్రకటించారు. ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30వరకు గడువు ఉందని, 100రూ.అపరాధ రుసుముతో మే 6వరకు అవకాశం ఉందని, పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలో 16మంది విద్యార్థులుగైర్హాజరు.తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, మంగవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పరీక్షకు 283మంది విద్యార్థులకు గాను 267 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 16మంది గైర్హాజరయ్యారని, ఘంట చంద్రశేఖర్ తెలిపారు. బీఎడ్ పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ సైన్స్ అండ్ ఆర్ట్ కళాశాల, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ కళాశాల బాన్సువాడ, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆడిట్ సెల్ అధికారులు తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్23: బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు మంగళవారం అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కల్లెడ గ్రామానికి చెందిన మాజీఎంపీటీసీ ప్రస్తుత సొసైటీ చైర్మన్ గంగారాంతో పాటు వార్డుసభ్యుడు మోహన్, పాఠశాల చైర్మన్ సాయన్న, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఎడ్ల రాం, సాయన్న, నూకల శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీలో చేరగా ఎమ్మెల్యే బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి తమవంతు కృషి చేస్తామని వారన్నారు.

నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణాలు

● పేరుకే క్రీడా మైదానాలు ● నిధులు నేల పాలు
● చోద్యం చూస్తున్న అధికారులు ● ఇబ్బందుల్లో క్రీడాకారులు



మెండోరలో నిరుపయోగంగా క్రీడా మైదానం



పోచంపాడ్‌లో క్రీడా మైదానం

మెండోర, ఏప్రిల్ 23: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంది. దీంట్లో భాగంగా పల్లెలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకొని నేటికి ఆట స్థలాలు నిరుపయోగంగా ఉన్న కానీ నాటి ప్రభుత్వ అధికారులు, నేటి ప్రభుత్వ అధికారులు క్రీడా మైదానాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో నేటికి క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. పల్లెల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకొని గ్రామాల్లో అనువైన స్థలాలను ఎంపిక చేసి క్రీడా బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ లక్ష్యాలు బాగానే ఉన్న క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. కొన్ని గ్రామాల్లో స్థలం లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే క్రీడా పోటీలు పెట్టారు. మరికొన్ని చోట్ల అప్పటికప్పుడు చెట్లు, ముళ్లపొదాలను తొలగించి మైదానాలను చదును చేసి ఎంతో ఆర్భటంగా క్రీడా బోర్డులను ఏర్పాటు చేశారు. అంత బాగానే ఉన్న గత ప్రభుత్వ అధికారుల వ్యవహార లోపం కారణంగా నేటికి మైదానాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో క్రీడలు ఆడేందుకు క్రీడాకారులు ముందుకు రావడంలేదు. పేరుకు మాత్రం బోర్డులను ఏర్పాటు చేసి పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మైదానాలలో మౌళిక వసతులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

● సదుపాయాలు ఎక్కడ?

మండలంలో వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో సదుపాయాలు కల్పించకుండా గత ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శలు ఉన్నాయి. నేటికి అవి గడ్డి, పిచ్చిమొక్కలతో క్రీడా మైదానాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు క్రీడా సామాగ్రి, ఇతర సదుపాయాలను కల్పించకపోవడంతో క్రీడాకారులకు మైదానాలకు దూరంగా ఉంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా ఉండేప్రభుత్వ పాఠశాల ఆవరణలు ఏర్పాటు చేశారు.దీంతో పాఠశాల సమయంలో క్రీడలు ఆడేందుకు వీలు ఉండకపోవడంతో పాటు పాఠశాల సమయం పూర్తి అయ్యక గేటుకు తాళలు వేస్తుండడంతో క్రీడా మైదానం విద్యార్థులకు క్రీడాకారులకు క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారుతున్నాయి.

● మండలంలో ఇలా

మండలంలో, గ్రామపంచాయతీలలో క్రీడా మైదానాలు గ్రామాలలో బోర్డులకే పరిమితం తప్ప ఏలాంటి వసతులు లేవు. బోర్డులు దర్శనమిస్తాయి తప్ప ఆటలు ఆడేందుకు వసతులు లేవని క్రీడాకారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఒక్కో మైదానం ఏర్పాటు కోసం ఉపాధి హామీ కింద రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేశారు కానీ నాటి నుంచి నేటి వరకు ఏలాంటి క్రీడలకు క్రీడా మైదానాలు నోచుకోలేదని, నేటి వరకు నిరుపయోగంగానే ఉన్నాయని క్రీడాకారులు విమర్శిస్తున్నారు.

● నీరుగారుతున్న లక్ష్యం

క్రీడాకారులను ప్రోత్సహం కోసం ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. గ్రామపంచాయతీలకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు కానీ మైదానాలు సరిగ్గా లేకపోవడంతో ఆటగాళ్లు ఎవరు మైదానాలకు రావడానికి ఆసక్తి చూపడంలేదు. నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం దేవుడెరుగు గానీ నేడు అయిన కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఇప్పుడైనా క్రీడాకారులను దృష్టిలో పెట్టుకొని నిరుపయోగంగా ఉన్న క్రీడా మైదానాలను క్రీడలు ఆడేందుకు మైదానాలను చదునుచేసి క్రీడా పరికరాలను ఏర్పాటు చేయాలని క్రీడాకారులు వాపోతున్నారు.

వినియోగంలోకి తేవాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలను అధికారులు పరిశీలించాలి. ఆట స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి. యువత క్రీడామైదానాలకు వచ్చే విధంగా ప్రోత్స హించాలి. క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచాలి. క్రీడా మైదానాలు వినియోగం లోకి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే గ్రామీణస్థాయి క్రీడాకారులు రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయి.

- పల్లె లింగారెడ్డి, క్రీడాకారుడు, మెండోర

గ్రామీణ క్రీడాకారులకు మేలు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన గత ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో క్రీడా ప్రాంగణాలు నేటికి నిరుపయోగంగానే ఉన్నాయి. నాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు అవుతారనే అనుకున్నారు. కానీ నిరుపయోగంగా ఉండడంతో క్రీడాకారులు క్రీడలకు దూరంగా ఉన్నారు. నేడు క్రీడా ప్రాంగణాలు ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి క్రీడా మైదానాల్లో అన్ని సదుపాయాలు కల్పించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు.

- గుండోజి రవి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

రైతులను ఓట్లడిగే హక్కు బీజేపీకి లేదు

● నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్23: బీజేపీ రైతు వ్యతిరేక పార్టీ అని వారికి రుణమాఫీ చేసే ఆలోచన ఎంత మాత్రం లేదని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలో పీవీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో యుపీఏ పాలనలో ఏకమొత్తంగా రూ.లక్ష రుణమాఫీ చేశామని అన్నారు. బీజేపీకి రైతులకు రుణమాఫీ చేయడానికి ఏనాడు ఆలోచించలేద న్నారు. రైతులకు రుణమాఫీ చేస్తే సోమరిపోతులవుతారని చెబుతున్న మోదీ బడావ్యాపారస్తులకు మాత్రం రూ.16లక్షల కోట్లు మాఫీ చేశారని అన్నారు. రైతులను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదని ఆయ న పేర్కొన్నారు.బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులకు విద్యుత్‌భారం కాకూడదని 2004లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉచిత విద్యుత్ ప్రారంభించారన్నారు. ఇదీ కాంగ్రెస్ పార్టీ ఘనత అని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఉచిత విద్యుత్ ఇస్తున్నారా ఎంపీ అర్వింద్ చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రైతులను ఆదుకోవడంలో విఫలమైన బీజేపీ రైతుల మోటర్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ఎంపీ అర్వింద్‌కు రైతులు గుర్తుకు వస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో రైతుల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని రైతులకు బాండ్ రాసిచ్చారని, పసుపుబోర్డు ఎక్కడ కనబడడంలేదన్నారు. మరోక ఐదేళ్లు అవకాశం ఇవ్వాలని అర్వింద్ అడగడం హాస్యాస్పదమన్నారు. దేశంలో 66చక్కెర కర్మాగారాలు పున ప్రారంభించామని చెబుతున్న అర్వింద్ బోదన్ ప్యాక్టరీని ఎందుకు ప్రారంభింలేదని ప్రశ్నించారు. చక్కెర కార్మాగారాన్ని పునప్రారంభించాలని అసెంబ్లీలో పలుమార్లు కోరామని జీవన్‌రెడ్డి గుర్తు చేశారు. నిజామాబాద్ రైతులను నాడు కవిత, ఆ తర్వాత అర్వింద్ మోసం చేశారని ఆయన విమర్శించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీఅధ్యక్షుడు మార చంద్రమోహన్, పట్ట ణ, మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబాగౌడ్, చిన్నారెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్, మోత్కురి లింగాగౌడ్, సంజయ్‌సింగ్‌బబ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి చేసి మూడు తులాల బంగారు చైన్ అపహరణ

కోటగిరి,ఏప్రిల్23: పొతంగల్ మండలంలోని రంగనాయకులు ఫారం గ్రామంలో భార్గవి అనే వృద్ధురాలిపై మంగళవారం గుర్తు తెలియని దుండగులు దాడి చేసి ఆమె మెడల్లోంచి మూడు తులాల బంగారు చైన్‌ను అపహరించుకుపోయారు. వివరాల్లోకి వెళితే.. రంగనాయకులు ఫారంలో భార్గవి, సుభాష్‌చంద్రబోసు అనే వృద్ధ దంపతులు నివసిస్తున్నారు. వీరి ఇంటి ఆవరణలో మామిడి చెట్లు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి మామిడి కాయలు కావాలంటూ వృద్ధురాలిని అడిగారు. చెట్టుపై ఉన్న కాయలను చూయిస్తుండగా వెనుక నుండి ఓ వ్యక్తి కర్రతో దాడి చేశాడు. వృద్ధురాలి మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైన్‌ను అపహరించుకుని పారిపోయారు. తీవ్ర గాయాల పాలైన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి తనయుడు రత్నబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గతంలోనూ శేషాద్రి ఫారంలో ఓ వ్యక్తిపై ఇదే విధంగా దాడి చేయడంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీయూ హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు

డిచ్‌పల్లి,ఏప్రిల్ 23: తెలంగాణ యూనివర్సిటీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీ హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. ఈ వేడుకలకు రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి, ప్రొఫెసర్‌లు, నాన్‌టీచింగ్ , టీచింగ్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

పెర్కిట్, ఏప్రిల్23: విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన హన్మాన్ శోభయాత్ర వైభవంగా కొనసాగింది. 11అడుగుల భారీ హన్మాన్, శ్రీరాముని విగ్రహల ప్రతిమలతో శోభయాత్ర ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి అనంత ఆంజనేయస్వామి మందిరం నుంచి అంబేద్కర్‌చౌరస్తా మీదుగా పెద్దబజార్, చిన్నబజార్, శివాజీచౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శోభయాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బిజేపీ నాయకులు విజయభారతి, ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవహ రాజులవారి దిగంబర్, విశ్వహిందు పరి షత్ సభ్యులు, భజరంగ్‌దళ్ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



జలాల్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యేకు మెమోంటో అందజేస్తున్న దృశ్యం

వర్నిఏప్రిల్23: వర్ని, చందూర్ మండలాల పరిధిలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో హనుమాన్, శ్రీరామ మందిరాలలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జలాల్‌పూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఏనుల రవీందర్ రెడ్డి శ్రీ రామ మందిరంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు మెమోంటో బహుకరించారు.

పలు ప్రాంతాల పరిశీలన



ఆర్మూర్ సానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్23: మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా పెర్కిట్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, ఫారెస్టు నర్సరీలో పెంచుతున్న మొక్కలను, గోల్‌బంగ్లా వద్ద సానిటేషన్ ప నులను, గూండ్ల చెరువు వద్ద ఓపెన్ జిమ్ములతో పాటు మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన పరిశీలించారు. అలాగే బస్టాండ్ ప్రాంతంలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న పండ్ల దుకాణాలు తొలగించాలని, డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపడతామని పండ్ల దుకాణదారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ భూమేశ్వర్, సానిటరీ ఇన్స్‌పెక్టార్ మహేష్, ఏఈ రఘు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

● 1.25 కేజీల గంజాయి స్వాధీనం ● ముగ్గురి అరెస్టు



పట్టుకున్న నింధితులతో ఎక్సైజ్ పోలీసులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 23: గంజాయిని అమ్ముతున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ దిలీప్ తెలిపారు. మంగళవారం నమ్మదగిన సమాచారం మేరకు నగరంలోని ఆటోనగర్‌లో షకీలాబీ ఇంట్లో తనిఖీ చేయగా గంజాయి దొరికిందని వారిని విచారించగా తన కూతురు నాందేడ్ జిల్లాకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసుకొని వచ్చి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అల్లుడు షేక్ వసీమ్ ద్వారా నిజామాబాద్‌లోని యువతకు అమ్ముతున్నట్లు తెలిపారు. గంజాయి అమ్ముతున్న షకీలాబీ, కూతురు అస్మా, అల్లుడు షేక్ వాసిమ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై మల్లేష్, సిబ్బంది ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

దొన్కల్ మాజీసర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

మోర్తాడ్, ఏప్రిల్23: మండలంలోని మాజీ సర్పంచ్ కత్తిముత్తెన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం మోర్తాడ్‌లోని ప్రజా భవన్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో చేరారు. వారికి సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గడ్డం అనిల్, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మహిపాల్, పర్స దేవన్న, దొన్కల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో ఆదినాథస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్23: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం శ్రీ ఆదినాథస్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రథోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. బుధవారం చక్రతీర్థం, గురువారం స్వామివారి నాగవెళ్లి జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంతంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ముగిసిన హనుమాన్ దీక్షలు



మోస్రాలో పూజలు చేస్తున్న స్వాములు

మోస్రా,ఏప్రిల్23: మండల కేంద్రంతో పాటు చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్, చే నెంబర్ తండా గ్రామాలలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం అనంతరం హనుమాన్ స్వాములు మాల విరమణ కోసం కొండగట్టు, భద్రాచలం పుణ్య క్షేత్రాలకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మండల గురుస్వాములు, స్వాములు పాల్గొన్నారు.

27న ఓయూలో మాదిగ విద్యార్థుల సదస్సు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 23: ఈ నెల 27న ఉస్మానియా యూనివర్సిటీ లో తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల మాదిగా విద్యార్థుల సదస్సు జరగనుందని, ఈ సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తిక్ మాదిగా యూనివర్సిటీ అధ్యక్షుడు దినేశ్ మాదిగా అన్నారు. మంగళవారం టీయూలో అధికార ప్రతినిధి వెంకటరమణతో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్‌లు, ఏ,బీ,సీ,డీ వర్గీకరణ వేగవంతం చేయాలని ఇందుకు సహకరిస్తున్న ప్రధానమంత్రి మోదీకి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. మాదిగాల చిరకల వాంచ ఎస్సీ రిజర్వేషన్, ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సాధనకు మోదీ హైదరాబాద్ కేంద్రంగా తోడుంటానని తెలపడమే ఇందుకు నిదర్శనమన్నారు. సుప్రీం కోర్టులో కూడా తీర్పు రిజర్వ్ చేసి ఉంచారని, త్వరలో ఈ తీర్పు సానుకూలంగా వస్తుందన్నారు.

రైతులు ధాన్యాన్ని తడవకుండా చూసుకోవాలి



ఏర్గట్లలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో మాలిక్

ఏర్గట్ల, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు మూడు రోజుల్లో వర్ష సూచన ఉన్నందున రైతులు ధాన్యం తడవకుండా ఉండేందుకు టర్పాలిన్‌లతో కప్పి ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సీఈవో జక్కని శ్రీనివాస్, సెంటర్ ఇంచార్జి సతీష్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పాలెం పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష వితరణ



పాలెం పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష అందజేసిన సుంకం రాజేశ్వర్

మోర్తాడ్, ఏప్రిల్23: మండలంలోని పాలెం ఎస్‌పీయూపీఎస్ పాఠశాల అభివృద్ధికి మంగళవారం రిటైర్డు ఎంపీడీవో సుంకం రాజేశ్వర్ రూ.లక్షలను అందజేశారు.పాఠశాల భవనానికి, తరగతి గదులకు, ప్రహరికి, పేయిం టింగ్, పాఠశాల గేట్, తదితర అభివృద్ధి పనులకు రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు సుం కం రాజేశ్వర్‌ను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో రాజేశ్వర్, సుంకం లక్ష్మణ్ కుటుంబసభ్యులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా సంఘాలకు రాజకీయ నాయకులు వద్దు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 23:జిల్లాలో ఉన్న క్రీడా అసోసియేషన్‌లకు రాజకీయ నాయకులు నాయకత్వం వహించ వద్దని క్రీడాకారులను క్రీడా సంఘాలకు బాధ్యులను చేయాలని జాతీయ స్థాయి మాజీ క్రీడాకారుడు సయ్యద్ ఖైసర్ డివైఎస్‌వోకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా క్రీడా సంఘాలన్నీ రాజకీయ నాయకులతో నిండి ఉన్నాయని ఒక్క క్రీడా అసోసియేషన్ క్రీడా కారుల చేతుల్లో లేదని అన్నారు. రాజకీయ నాయకులకు క్రీడా సంఘాలతో ఏం పని ఉంటుందన్నారు. ఇప్పటికైనా క్రీడా సంఘాలకు క్రీడాకారులనే అసోసియేషన్ బాధ్యులుగా చేయాలని విన్నవించారు.అంతేకాకుండా అర్బన్‌లోసమ్మర్ కోచింగ్‌క్యాంప్‌ఏర్పాటు చేయాలన్నారు.

మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్న సీఎం

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్23: బోధన్ షుగర్ ఫ్యాక్టరీని సెప్టెంబరు 17న తెరిపిస్తానని మాయమాటలు చెప్పి సీఎంరేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీని మూసివేసింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. సాధ్యంకాని రుణమాఫీ కోసం అబద్ధాలు ఆడుతున్న రేవంత్‌రెడ్డికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం దేవుళ్ల మీద ప్రమాణం చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. తమ బకాయిలు చెల్లించాలని ఎర్రజొన్న రైతులు ఆందోళన చేస్తే కాల్పులు జరిపి కేసులు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బకాయిలు ఎగొట్టి కాల్పులు జరిపితే కేసీఆర్ ప్రభుత్వంలో రూ.11కోట్ల బకాయిలను రైతులకు చెల్లించడమే గాకుండా బేషరతుగా రైతులపై ఉన్న కేసులను ఎత్తివేశారన్నారు. ఇదీ కేసీఆర్‌కు రైతులపై ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. పసుపుబోర్డు ఏర్పాటు చేయిస్తా నని మోసపు మాటలు మాట్లాడిన ఎంపీ అర్వింద్ మరోసారి జిల్లా రైతాం గాన్ని దగా చేయాలని చూస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల లబ్ధి కోసం రైతుల ఓట్ల కోసం పసుపుబోర్డు ఇచ్చామని, ప్రధాన మంత్రితో అబద్ధపు ప్రకటన చేయించారని ఆయన విమర్శించారు. పసుపుబోర్డు అడ్రస్ ఎక్కడో చెప్పాలన్నారు. కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం లాంటిదని రైతుబంధు, రైతు బీమా ఇవ్వడమే గాకుండా సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేసి ధాన్యం కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దేనన్నారు. అబద్ధాలు వల్లిస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు చరమగీతం పాడి అసలైన రైతు పక్షపాతి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి కేసీఆర్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు.

అంబంలో అలరించిన కుస్తీ పోటీలు



అంబంలో కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్లయోధులు

రుద్రూరు, ఏప్రిల్ 23: మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం గ్రామంలో మైసమ్మ వద్ద కుస్తీ పోటీలను నిర్వహించారు. పోటీలో మల్లయోధులు ఆసక్తిగా పాల్గొన్నా రు. కోటగిరి, వర్ని, రుద్రూరు, బీర్కూర్ మండలాల నుంచి మల్లయోధులు వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన మల్ల యోధులకు నగదు రూపంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శానం పోశెట్టి, కార్యదర్శి కమ్మరి రవి, గ్రామ పెద్దలు పట్టేపు రాములు, మంత్రి గంగారమ్, ఆత్మారి మహేష్, మంత్రి నర్సయ్య, హన్మాండ్లు, తాహెర్, సాయిరెడ్డి, నాగనాథ్ తదితరులు ఉన్నారు.

● ఉమ్మడి మండలంలో కుస్తీ పోటీలు

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కుస్తీపోటీలు నిర్వహించారు. కోటగిరి మండల కేంద్రంలో ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలను ఏర్పాటు చేశారు. 10రూపాయలు మొదలుకుని 2వేల రూపాయల వరకు నగదు బహుమతులను ఏర్పాటు చేశారు. కుస్తీపోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పొతంగల్ మండలంలోని కొల్లూర్ గ్రామంలో కుస్తీపోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఉమాకాంత్ దేశాయ్, బీమా సాయిరెడ్డి, మాధవరావు, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: ఈనెల 25 నుంచి ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30ల నుంచి 5.30ల వరకు ఉదయ, మధ్యా హ్నా సెషన్స్‌లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని 9 సెంటర్లు ఇంటర్మీడియేట్ కొరకు, 8 పదవ తరగతి కొరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

● టెక్నికల్ కోర్సు కోసం..

టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు మే 1 నుంచి జూన్ 13 వరకు 42 రోజుల పాటు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు. ఈ కోర్సు చేసేందుకు 22-04-2024 నాటికి 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాలలోపు కలిగిన వారు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.సంబంధిత కోర్సులో లోయర్ గ్రేడ్, టీసీసీ ఉత్తీర్ణులై ఉండాలని ఇతర రాష్ట్రాల వారు అడ్మిషన్లు పొందాలంటే ముందుగా పరీక్షల విభాగం హైదరాబాద్ అనుమతి పొందాలన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 23 నుంచి బీఎస్ఈ.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని దరఖాస్తుతో పాటు ఫొటో, లోయర్ గ్రేడ్ పాస్ మెమో, ఎస్సెస్సీలాంగ్ మెమో,ఆధార్‌జిరాక్స్‌లతో గెజిటెడ్‌అధికారి అటెస్ట్ చేసిన కాపీలను జిల్లా కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో అందజే యాలన్నారు.

● వేసవి సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించరాదు

జిల్లాలోని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ప్రభుత్వం ఈనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ప్రకటించిందని ఈసెలవుల్లో పాఠశాలలు ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ హెచ్చరించారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించినట్లు తన దృష్టికి వస్తే ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి ఆయిల్ చోరీ

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్23: ఆర్మూర్ శివారులోని అంకాపూర్ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తుతెలియని దొంగలు ఆయిల్ చోరీ చేశారని విద్యుత్ ఏఈ మనిష తెలిపారు. గుర్తుతెలియని దొంగలు ఎస్ఎస్ 320/63 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సర్కిట్ బ్రేకర్ ద్వారా సుమారు రూ.15వేల విలువ గల ఆయిల్‌ను దొంగిలించారని మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

● గ్రామాల్లో కిటకిటలాడిన హనుమాన్ దేవాలయాలు ● ఘనంగా శోభాయాత్ర ● ఆలయాల వద్ద అన్నదానం



తుంగినిలో పూజలు నిర్వహిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



తుంగినిలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



హనుమాన్ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న జడ్పీ చైర్మన్

నవీపేట,ఏప్రిల్23: మండలంలోని వివిధ గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆంజనేయ స్వామి మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుంగినిలోని చారిత్రక హనుమాన్ మందిరంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా హనుమంతుడి వేషధారణ ధరించిన తుంగినికి చెందిన 8సంవత్సరాల సాయిచరణ్‌ను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అభినందించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులను సైతం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి శరత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మానికేశ్వర్ రావు, మహిపాల్ రెడ్డి, రవీందర్ రావు, అశోక్ దయమా తదితరులు పాల్గొన్నారు.

తుంగిని హనుమాన్ మందిరంలో ప్రముఖుల పూజలు

నవీపేట: మండలంలోని చారిత్రక తుంగిని హనుమాన్ మందిరంలో పలువురు ప్రముఖులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనమాన్ జయంతిని పురస్కరించుకుని పలువురు నాయకులు వేర్వేరుగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి మండలంలోని తుంగిని హనుమాన్ మందిరంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహిం జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు తుంగిని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత తుంగిని హనుమాన్ మందిరంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ.మోహన్ రెడ్డి తుంగిని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డిచ్‌పల్లి: రామ్ లక్ష్మణ్ జానకీ జైబోలో హనుమాన్‌కీ అంటూ హిందు సోదరులు మంగళవారం హనుమాన్‌జయంతి వేడుకలను ఘనంగా జరు పుకున్నారు.డిచ్‌పల్లి మండలకేంద్రంలో యువకులు,హిందు సోదరులు కాషాయ జెండాలతో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరాము అంటూ భక్తి పాటాలు పాడుతూ డిచ్‌పల్లి నాగపూర్ గేటు నుంచి, గ్రోమోర్, ఘన్‌పూర్, ఇస్లాంపూర, మీదుగా రైల్వేస్టేషన్ హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సైమహేశ్, భారీపోలీస్ భద్రత ఏర్పాట్లుచేశారు.మండలంలోని రాంపూర్‌గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి వేడుకలను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషానిచ్చిందన్నారు.ఎమ్మెల్యే వెంటకాంగ్రెస్ ప్రతినిధులు అమృతాపూర్ గంగాధర్,తారచంద్ నాయక్, కంచెట్టి గంగాధర్, దత్తద్రి, తదితరులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ వుల్లోల గంగాధర్ గౌడ్ రాంపూర్ హనుమాన్ ఆలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఏడో బెటాలియన్‌లోని ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద 41అడుగుల హనుమాన్ విగ్రహం వద్ద పోలీసులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండల గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలోఆలయాలకమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంతో పాటు చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్, చే నెంబర్ తండా గ్రామాలలో చైత్ర శుద్ధ పౌర్ణమి మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జడకొప్పులాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్, నవీన్, విజయ్,నందు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షుడు సూర రాములు, భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నూలు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రుద్రూరు: హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం మండలం లోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, అంబం(ఆర్),బొప్పాపూర్,ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో హనుమాన్ స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్, ఆర్మూర్ హన్మాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం హన్మాన్ జయంతి పురస్కరించుకొని మామిడిపల్లిలోని ఆనంత ఆంజనేయస్వామి ఆలయంలో, పెర్కిట్ హన్మాన్ ఆలయంలో, జంబి హన్మాన్ ఆలయంలో, పెద్దబజార్ హన్మాన్ ఆలయంలో భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

మెండోర: మండలంలో ఘనంగా హన్మాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలో మెండోర, బుస్సాపూర్, సోన్‌పేట్, పోచంపాడ్, చాకిర్యాల్, కోడిచర్ల, సావెల్, దూదిగాం, వెల్కటూర్ గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ మందిరంలో ఆంజనేయస్వామిని దర్శించుకొని మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలంలోని అన్ని గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం నుండే వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని మారుతీ మందిరంతో పాటు పలు ఆలయాల్లో యజ్ఞ, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు.

ఎడపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలలో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చిత్రపటంతో గ్రామాలలోని పురవీధుల గుండా బాజాభజంత్రీలతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆలయాల దగ్గర భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

రెంజల్: మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు ఆలయాలకు చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు నిర్వహించారు.

ముప్కాల్: బాల్కొండ, ముప్కాల్ ఉమ్మడి మండలాల్లోని ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. మండలాల్లోని అన్ని గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలలో ఆంజనేయస్వామికి సింధూరంతో అభిషేకం, అర్చనలు, సత్యనారాయణ వ్రతాలు ఆలయ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం హనుమాన్ భక్తులుశోభాయాత్ర, అన్నదానం నిర్వహించారు.అనంత రంతక్కురివాడ,మున్నూరు సంఘంఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఏర్గట్ల: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని అన్నీ గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్త లతో కిటకిటలాడాయి. మండల కేంద్రంతో పాటు గుమ్మిర్యాల్ గ్రామంలోని పాటి హనుమాన్ ఆలయం వద్ద భక్తలు అధిక సంఖ్యలలో పాల్గొన్ని అన్నధానాన్ని స్వీకరిం చారు.

డొంకేశ్వర్: మండలంలోని డొంకేశ్వర్, నికాల్‌పూర్, అన్నారం, సిర్పూర్, చిన్నయానం, నడ్కుడ గ్రామాలలో మంగళవారం హన్మాన్ ఆలయాలలో ప్రత్యేక పూజలు, యజ్ఞం, అభిషేకాలు పూజలు నిర్వహించారు.

సిరికొండ: సిరికొండలో హనుమాన్ జయంతిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ మందిరాల్లో భక్తులు, ఆలాయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపించారు.

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండలాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కోటగిరి, పొతంగల్, ఎత్తొండ, కల్లూర్, హంగర్గ, హెగ్డోలి, కొల్లూర్ గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



రాంపూర్‌హనుమాన్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



బోధన్ హనుమాన్ మందిరంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



మోస్రాలో జడకొప్పులాట దృశ్యం

సీఎం ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదు

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఏ ఒక్క పథకాన్ని ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అధికా రంలోకి రాగానే రుణమాఫీ చేస్తానని ప్రకటించారన్నారు. ఇప్పుడేమో వచ్చే పంద్రాగస్టు లోపు రుణమాఫీ చేస్తానని ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం కుటుంబ సభ్యులు ఏం చేస్తున్నారో అందరికి తెలుసని ఆయన ఆరోపిం చారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నేతలను హామీలపై నిలదీయాలన్నారు. సీఎం బీజేపీతో కుమ్మక్కై నిరాధారనమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీని ఓడించే సత్తా కాంగ్రెస్‌కు లేదన్నారు. ఎమ్మెల్సీ కవితపైన నిరాధారమైన ఆరోపణలు చేసి అరెస్టు చేశారని ఆయన విమర్శించారు. బీజేపీ అభ్యర్థి మొదటి నుంచి అబద్ధాలకోరు అని విమర్శించారు. అర్వింద్ పెద్ద అబద్ధాల కోరని అదే రీతిలో ప్రధాని మోదీ కూడా అబ్ధాలు అని ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాముడి రూపంలో రావణాసురులు వస్తు న్నారని ఆయన ఆరోపించారు. రాముడికి రాజకీయాలకు సంబంధం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్త మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో కేసీఆర్‌ను బలపర్చి బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి స్థాయిని తగ్గించుకొని మాట్లాడుతున్నారని విమర్శించారు. జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడలేదన్నారు. వడగండ్ల వల్ల దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని చెప్పలేదన్నారు. పసుపు బోర్డు తీసుకువస్తానని చెప్పిన ఎంపీ అర్వింద్ ఇక్కడి రైతులను మోసం చేశాడని విమర్శించారు. కేడీ జోడీ అయిన వల్ల ప్రజలకు ఉపయోగం లేదని ఆయన విమర్శించారు. ఈవిలేకరుల సమావేశంలో నగర మేయర్ నీతూకిరణ్, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, ఎలగందుల మురళితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

జక్రాన్‌పల్లి, ఏప్రిల్23: మండలంలోని తొర్లికొండ గ్రామంలో మంగళవారం ప్రాథ మిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పనులను ఎంపీడీవో సతీష్‌కుమార్ పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనం తరం పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగితెలుసు కున్నా రు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్, పీఆర్ఏఈ సురేంద్ర వర్మ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ రాధ, సీఆర్‌పీ నరేష్, తదితరులు పాల్గొన్నారు.



తొర్లికొండలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

నేడు మోస్రాలో కుస్తీపోటీలు

మోస్రా,ఏప్రిల్23: మండల కేంద్రంలోని రామాలయం వద్ద బుధవారం కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలలో పాల్గొనే వ్యక్తులు హాజరుకావాలని కోరారు.

బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి

నవీపేట, ఏప్రిల్23: రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.భూమయ్య కోరారు. మంగళవారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకు అండగా ఉన్న భారతీయ జనతా పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోశెట్టి, జీవన్, చిరంజీవి, రమేష్, నర్సింలు, కార్తీక్ తదితరులున్నారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75,000	రూ.69,190	రూ.870

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (1.10, 7.25)
: టిల్లు స్క్వేర్ (4.30, 10.25)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.40)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 10.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (7.15)
స్క్రీన్-3 : తెప్ప సముద్రం (1.40)
: పారిజాత పర్వం (4.35)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (7.30)
: మార్కెట్ మహాలక్ష్మి (10.35)
స్క్రీన్-4 : హ్యాపిడేస్ (1.30)
: లవ్‌యూ శంకర్ (తెలుగు) (4.50)
: టెనెంట్ (7.30)
: మైదాన్ (హిందీ) (9.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (1.45, 7.30)
: మంజుమ్మల్ బాయ్స్ (4.35, 10.30)
స్క్రీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (11.00, 1.40)
: ఫ్యామిలీ స్టార్ (4.25, 10.30)
: హ్యాపిడేస్ (7.35)
స్క్రీన్-3 : హ్యాపిడేస్ (10.40, 4.30, 10.30)
: మంజుమ్మల్ బాయ్స్ (7.40)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : హ్యాపిడేస్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్